1
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శనివారం | ఫిబ్రవరి 22, 2025 | www.navatelangana.com

పద్మశ్రీ గ్రహీత మందకృష్ణకు సన్మానం

నవతెలంగాణ-ఖానాపూర్

పద్మశ్రీ అవార్డు గ్రహీత, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణను శుక్రవారం మల్లు అనంత రాములు కుమారుడు ఆల్ ఇండియా రాహుల్ గాంధీ ఫాలోవర్స్ ఫ్రంట్ చైర్మన్ మల్లు శివరామ్, రాష్ట్ర అధ్యక్షులు శనిగారపు కమలాకర్ హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన చేసిన కార్యక్రమాలను, ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు.



పత్తి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఎంపీ

నవతెలంగాణ-జైపూర్

పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ శుక్రవారం చెన్నూరులోని పత్తి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. స్థానిక నాయకులతో కలిసి కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో మాట్లాడారు. రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారాన్ని కృషి చేసిన ఎంపీకి రైతులు కృతజ్ఞతలు తెలిపారు. కొనుగోలు ప్రక్రియలో అవాంతరాలు లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు, అధికారులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



రంజాన్ పండుగ ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రంజాన్ పండుగ ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మార్చి 2 నుండి ప్రారంభమయ్యే రంజాన్ మాసంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ హాలులో సమావేశం నిర్వహించారు. ముస్లింలకు పవిత్ర మాసమైన రంజాన్ నెల మార్చి 2 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో రంజాన్ నెలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. మసీదులు, ఈద్గాల వద్ద నీటి వసతి, వీధి దీపాలు, నిరంతర కరెంట్ సౌకర్యం తదితర ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రంజాన్ నెలలో ముస్లిం సోదరుల ప్రత్యేక ప్రార్థనలు దృష్టిలో ఉంచుకొని వారికి ఉద్యోగ సమయాల్లో వెసులుబాటు కల్పించిందని పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న ముస్లిం ఉద్యోగులు మార్చి 2 నుంచి 31 వరకు సాయంత్రం 4గంటలకే కార్యాలయ విధులు నిర్వహించుకొని ఇళ్లకు వెళ్లొచ్చని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. సాయంత్రం నమాజ్, రోజాను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. సానిటేషన్, సీసీ కెమెరాలు, మైనార్టీ స్కూల్‌లో ఇఫ్తార్ విందు ఏర్పాట్లు, కరెంట్ సమస్య తదితర వాటిపై పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, సబ్ కలెక్టర్ యువరాజ్, ఆర్డీఓ వినోద్ కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలి



నవతెలంగాణ-సారంగాపూర్

రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పని చేయాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మెన్ అన్వేష్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు అన్నారు. మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ శుక్రవారం మండల కేంద్రంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతిపక్ష బీఆర్ఎస్ పోటీ చేయలేకపోయిందని, కాంగ్రెస్ గెలుపును అడ్డుకోడానికి లోపాయికారిగా బీజేపీకి సహకరిస్తుందని పేర్కొన్నారు. పట్టభద్రులు వివేకంతో ఆలోచించి రాష్ట్రాన్ని సంక్షేమం, అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా నిలబడాలని కోరారు. సమయం తక్కువగా ఉన్నందున ఎమ్మెల్సీ అభ్యర్థి విజయం సాధించేంతవరకు అహోరాత్రులు కష్టపడాలని తెలిపారు. ఈ సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ నారాయణరెడ్డి, నిర్మల్, సారంగాపూర్ మార్కెట్ ఛైర్మెన్లు సోమ భీమారెడ్డి, అబ్దుల్ హది, మాజీ జిల్లా గ్రంథాలయ ఛైర్మెన్ రాజేందర్, మాజీ జడ్పీటీసీ రాజేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు బొల్లోజి నర్సయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాజేశ్వర్, జిల్లా కిసాన్ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ పోతారెడ్డి, మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ముత్యంరెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, రాజ్ మహమ్మద్, భోజాగౌడ్, కాశీనాథ్, జగదీశ్వర్, లక్ష్మణ్, రమేష్, నర్సాగౌడ్, సాయన్న పాల్గొన్నారు.

మహిళా శ్రామిక దినోత్సవం విజయవంతం చేయండి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అంతర్జాతీయ మహిళా శ్రామిక దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుక అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో ఏర్పాటు చేసి దినోత్సవానికి సంబంధించిన కరపత్రలను ఆవిష్కరించారు. మార్చి 8న మావల మండలం కొమరం భీమ్ కాలనీలో అంతర్జాతీయ శ్రామిక మహిల దినోత్సవాన్ని ఆదివాసీ మహిళా సంఘం తుడుం దెబ్బ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. మహిళలు పనిచేసే ప్రదేశాలలో మెరుగైన సౌకర్యాలు, శ్రమకు తగ్గ వేతనం, పని గంటలు తగ్గించాలని, వివక్షత, అసమానతలు వ్యతిరేకంగా ఓటు హక్కు కోసం పోరాడారన్నారు. మహిళా దినోత్సవాన్ని అన్ని వర్గాల ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, కార్మికులు, కర్షకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు ఇందిరా, ఆదివాసీ మహిళా సంఘం డివిజన్ ఉపాధ్యక్షురాలు లలిత, సోయం సుమన్, వెడ్మ మాన్కు, సిడాం రూప, అనసూయ పాల్గొన్నారు.

ఈ రోడ్డుకు మోక్షమెప్పుడు..?

- యాపల్‌గూడ- సల్యాద రోడ్డుకు రూ.2.19కోట్లు మంజూరు
- ఏడాది దాటినా పనులు ప్రారంభించని గుత్తేదారు
- ముప్పతిప్పలు పడుతున్న మూడు గ్రామాల ప్రజలు
- పట్టించుకోని ఐటీడీఏ అధికారులు

ఆ గ్రామాలకు వెళ్లేందుకు సరైన రోడ్డు మార్గం లేదు.. మండల కేంద్రానికి వెళ్లాలన్నా.. ఏ ఇతర గ్రామానికి వెళ్లాల్సిన ఉన్నా మట్టి రోడ్డే దిక్కు. వర్షాకాలంలో కనీసం ద్విచక్ర వాహనం కూడా వెళ్లలేని పరిస్థితి. ఏడాది క్రితం కొత్తగా బీటీ రోడ్డు మంజూరైన సంతోషపడిన ఆ గ్రామస్తులను గుత్తేదారు నిర్లక్ష్యం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. అనేక ఏండ్లుగా ఆతృతగా ఎదురుచూస్తున్న రోడ్డు నిర్మాణం ఆగిపోవడంతో తీవ్ర నిరాశ చెందుతున్నారు ఇచ్చోడ మండలంలోని జగనాపూర్, కోమటిగూడ, పెద్ద సల్యాద గ్రామాల ప్రజలు. గుత్తేదారు నిర్లక్ష్యం..అధికారుల అలసత్వం కారణంగా ఏడాది క్రితం మంజూరైన రోడ్డు ఇప్పటికీ ప్రారంభం కావడం లేదు. దీంతో అనేక ఏండ్లుగా మట్టిరోడ్డు గుండానే పయనిస్తున్న ఆ గ్రామాల ప్రజలకు మరికొన్నేండ్లు ఈ దుస్థితి తప్పేలా కనిపించడం లేదు. మట్టి..గుంతల రోడ్డుపై ప్రయాణం చేస్తూ పడుతున్న ఇబ్బందులు దూరం కావడం లేదు. ఉన్నతాధికారులు దృష్టిసారించి రోడ్డు పనులు మొదలయ్యేలా చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



పెద్ద సల్యాదకు వెళ్లే రోడ్డు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఇచ్చోడ

ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని జగనాపూర్, కోమటిగూడ, పెద్ద సల్యాద గ్రామాల ప్రజలు ఇప్పటికీ బీటీ రోడ్డుకు నోచుకోవడం లేదు. ఈ మూడు గ్రామాల పరిధిలో సుమారు 1500 జనాభా కలిగి ఉన్నాయి. మండల కేంద్రం నుంచి ఈ గ్రామాలకు వెళ్లాలంటే సుమారు 15 కిలోమీటర్లు పయనించాల్సి ఉంటుంది. కేవలం యాపల్‌గూడ గ్రామం వరకు బీటీ రోడ్డు ఉండగా..అక్కడ్నుంచి పెద్ద సల్యాద వరకు కేవలం మొరం రోడ్డు మాత్రమే ఉంది. అది కూడా పెద్ద పెద్ద గుంతలతో ప్రమాదకరంగా ఉంది. 3కిలోమీటర్ల వరకు ఈ రోడ్డు గుండానే ఆయా గ్రామాల ప్రజలు వివిధ పనుల నిమిత్తం నిత్యం పయనిస్తూ మండల, జిల్లా కేంద్రానికి చేరుకుంటారు. అత్యవసరంలో ఆస్పత్రికి వెళ్లాలన్నా అంబులెన్సు కూడా రాలేని పరిస్థితి ఉంటుంది. దీంతో ఎడ్లబండ్లు, ద్విచక్రవాహనాలపై తీసుకెళ్తుంటారు. మరోపక్క వర్షాకాలంలో ద్విచక్ర వాహనాలు కూడా నడవలేని పరిస్థితి ఉంటుంది. ఈ గ్రామాల ప్రజల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఐటీడీఏ ద్వారా 2023-24 ఏడాదిలో 2.5కిలోమీటర్ల మేర బీటీ రోడ్డును మంజూరు చేసింది. ఇందుకు రూ.2.19కోట్లను కేటాయించింది.

ప్రారంభాన్ని మరిచిన గుత్తేదారు..!

ప్రభుత్వం మంజూరు చేసిన బీటీ రోడ్డును టెండర్ ద్వారా దక్కించుకున్న ఓ గుత్తేదారు పనులు మాత్రం ప్రారంభించడం లేదు. పనులు ప్రారంభించాలని అడిగితే ప్రభుత్వం నుంచి డబ్బులు రావడం లేదని అందుకే మొదలు పెట్టడం లేదని గుత్తేదారు చెబుతున్నారని ఆ గ్రామ ప్రజలు చెబుతున్నారు.

ఐటీడీఏ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు మంజూరు కాక ఇన్నాండ్లు ఇబ్బందులు పడితే..మంజూరైనా ప్రారంభించకపోవడం మరో సమస్యగా మారుతోందని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. మట్టి రోడ్డు గుండా పయనించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వాపోతున్నారు.



చాలా ఇబ్బందులు పడుతున్నాం : లక్ష్మణ్, గ్రామ పటేల్, పెద్ద సల్యాద

మండల కేంద్రం నుంచి యాపల్‌గూడ వరకు మాత్రమే బీటీ రోడ్డు ఉంది. అక్కడ్నుంచి మా గ్రామానికి మూడు కిలోమీటర్లు మట్టి రోడ్డు గుండానే పయనించాల్సి ఉంటుంది. అనేక ఏండ్ల నుంచి ఈ గుంతల రోడ్డుపై ప్రయాణిస్తుండటంతో నడుము నొప్పులు వస్తున్నాయి. జ్వరాలు వచ్చినా ఆస్పత్రికి వెళ్లడం కష్టంగా మారుతోంది. చాలా ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు దృష్టిసారించి రోడ్డు పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి.



ఎవరూ పట్టించుకోవడం లేదు : పెందూర్ రమేష్, తాజామాజీ సర్పంచ్, సల్యాద

యాపల్‌గూడ నుంచి మా గ్రామం వరకు ఏడాది క్రితమే బీటీ రోడ్డు మంజూరైంది. కానీ ఇప్పటికీ పనులు ప్రారంభం కావడం లేదు. గుత్తేదారుతో పాటు ఐటీడీఏ అధికారులను కలిసి విన్నవించినా పట్టించుకోవడం లేదు. ఈ మట్టి రోడ్డు గుండా ప్రయాణం చేయాలంటే గ్రామస్తులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు దృష్టిసారించి పనులు మొదలయ్యేలా చూడాలి.

ఎటూ తేల్చుకోలేకపోతున్న కోనప్ప

- కాంగ్రెస్ పార్టీకి గుడ్‌బై చెప్పినట్లే కన్పిస్తున్న సంకేతాలు
- గురువారం ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశానికి గైర్హాజరు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

బీఆర్ఎస్ నుండి పోటీ చేసి ఓడిపోయిన సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆ తర్వాత కాంగ్రెస్‌లో పార్టీలో చేరారు. కొన్ని రోజులుగా కాంగ్రెస్ పార్టీకి దూరంగా ఉంటూ ఎటూ తేల్చుకోలేక సందిగ్ధంలో పడ్డట్లు తెలుస్తోంది. నియోజకవర్గంలో ఎమ్మెల్సీ దండే విఠల్ తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ అనుచర గణాన్ని ఏర్పాటు చేసుకుంటున్నారు. రాబోయే ఎన్నికల్లో ఈ నియోజకవర్గం నుండి పోటీ చేసే యోచనలో ఉండి గ్రూపును ఏర్పాటు చేసుకుంటున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉండడం కూడా ఆయనకు కలిసి వస్తోంది. మాజీ ఎమ్మెల్యే కోనప్పను కలుపుకొని పోకపోవడం, తన గ్రూపును దండే విఠల్ టార్గెట్ చేయడం కోనప్పకు నచ్చడం లేదు. దీంతో కోనప్ప కొన్ని రోజులుగా కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ సేవా కార్యక్రమాలను కొనసాగించుకుంటున్నారు. దీనికి తోడు గురువారం కాగజ్‌గర్ పట్టణంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. దీనికి కోనప్ప దూరంగా ఉండడంతో కాంగ్రెస్ పార్టీలో విభేదాలు బహిర్గతమయ్యాయి. శుక్రవారం పెంచికల్‌పేట్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు మద్దతిస్తున్నట్లు బహిరంగ ప్రకటన చేశారు. దీంతో కోనప్ప కాంగ్రెస్ పార్టీతో పూర్తిస్థాయిలో విభేదించుకున్నట్లు తెలుస్తోంది. తాను బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మంజూరు చేయించిన పనులను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయడం తనను తీవ్ర మనోవేదనకు గురి చేస్తోందని కోనప్ప అనుచరులతో పేర్కొంటూ ఎన్నికలకు వచ్చే నాయకులను గల్లా పట్టి నిలదీయాలని పేర్కొనడం సంచలనంగా మారింది. కాంగ్రెస్ పార్టీపై బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్న కోనప్ప ఏ పార్టీలో చేరబోనని, స్వతంత్రంగానే బరిలో నిలుస్తానని కార్యకర్తల్లో మనోధైర్యాన్ని నింపే ప్రయత్నం చేస్తున్నారు.



స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు మద్దతు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కోనప్ప(ఫైల్)

సోషలిస్టు వ్యవస్థనే ప్రత్యామ్నాయం

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పెట్టుబడి దారి వ్యవస్థకు సోషలిజమే ప్రత్యామ్నాయమని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ అన్నారు. 176 ఏండ్ల క్రితం వెలువడిన కమ్యూనిస్టు ప్రణాళిక నేటికీ అనుసరణీయమని చెప్పారు. శుక్రవారం పార్టీ జిల్లా కార్యాలయంలో రెడ్ బుక్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీ రాజకీయ ముసాయిదాను సామూహిక పఠనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్టుబడిదారి వ్యవస్థలో ఆర్థిక అసమానతలు సహజంగానే పెరుగుతున్నాయని పేర్కొన్నారు. 2008లో అమెరికాలో వచ్చిన ఆర్థిక సంక్షోభం ప్రస్తుతం ప్రపంచ సంక్షోభంగా మారిందని వివరించారు. నిరుద్యోగం, పేదరికం పెరిగిందని, మరోపక్క కొంత మంది కార్పొరేట్ శక్తులు, పెట్టుబడిదారుల దగ్గర సంపద పోగుబడుతోందని చెప్పారు. మన దేశంలో నేటికీ 85కోట్ల మంది తెల్లరేషన్‌కార్డుల మీద ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారని మరోపక్క ప్రపంచ కుబేరుల్లో అదానీ, అంబానీ లాంటి వారు చేరుతున్నారని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలు దీనికి కారణమని స్పష్టం చేశారు. సోషలిజం మాత్రమే ఆర్థిక అంతరాలు లేని సమాజాన్ని సృష్టిస్తుందని కమ్యూనిస్టు ప్రణాళిక పేర్కొందని ఇది అందరికీ ఆచరణీయమని పేర్కొన్నారు. సోషలిజం సాధించడం కోసం కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లంక రాఘవులు, సీనియర్ నాయకుడు బండి దత్రాత్రి, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.మంజూల, ఆర్.సురేందర్, జమున, ఎస్.స్వామి, నాయకులు లింగాల చిన్నన్న, ఏ.స్వామి, ఉయిక విష్ణు, ఆరిఫా, లలిత, కె.ఆశన్న పాల్గొన్నారు.

సెలవు పెట్టిన చోట ప్రత్యామ్నాయం ఏదీ?

- తెరుచుకోని నాలుగు పాఠశాలలు
- నష్టపోతున్న విద్యార్థులు

నవతెలంగాణ-కెరమెరి

విద్యాశాఖలో బయోమెట్రిక్ విధానం వచ్చినప్పటికీ ఉపాధ్యాయుల తీరు మాత్రం మారడం లేదు. ఉపాధ్యాయులు సెలవు మంజూరు గూర్చి కాంప్లెక్స్ హెచ్‌ఎంకు సమాచారం ఇవ్వాల్సి ఉన్నా ఇవ్వకుండానే సెలవుల్లో వెళ్తున్నారు. ఉపాధ్యాయుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఇష్టారీతిన సెలవులు పెడుతుంటే విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని ఏసాపూర్, పద్మావతి, నారాయణ్‌గూడ, అంతపూర్ పాఠశాలలు శుక్రవారం తెరుచుకోలేదు. ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులు వ్యవహరిస్తున్న తీరుతో విద్యార్థులు నష్టపోతున్నారు. తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దు గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు కాంప్లెక్స్ హెచ్‌ఎంకు సమాచారం ఇవ్వకుండానే సెలవులు పెడుతూ వారి సొంత పనులు చేసుకుంటున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. మరో పక్క మండలంలోని పాఠశాలలపై పర్యవేక్షణ సరిగా లేదని తెలుస్తోంది. పాఠశాలలపై కాంప్లెక్స్ హెచ్‌ఎం పర్యవేక్షణ లోపంతో ఉపాధ్యాయులు వారికి నచ్చినట్లుగా సెలవులు తీసుకుంటూ విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెడుతున్నారు. నారాయణ్‌గూడ ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. శుక్రవారం ఉదయం ఓ ఉపాధ్యాయుడు హాజరు కాగా మరొకరు గైర్హాజరయ్యారు. ఉదయం హాజరైన పాధ్యాయుడు మధ్యాహ్నం వెళ్లిపోయాడు. నారాయణ్‌గూడ, ఏసాపూర్, పద్మావతి ప్రాథమిక పాఠశాలలు తెరుచుకోనేలేదు. మొత్తం మీద పాఠశాలల్లో కొంత మంది ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. ఉపాధ్యాయుడు సెలవుపై వెళ్తే పాఠశాల మూసి ఉండకుండా ప్రత్యామ్నాయంగా మరో ఉపాధ్యాయున్ని సర్దుబాటు చేయాల్సి ఉంది. అలా కాకుండా నాలుగు పాఠశాలలు మూసి ఉండడం చూస్తుంటే విద్యా వ్యవస్థలో బాధ్యత, పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. పలువురు ఉపాధ్యాయులు దూరప్రాంతాల నుండి విధులకు ఆలస్యంగా హాజరవుతున్నారు. పాఠశాల పని వేళలు ముగియకముందే వెళ్లిపోతున్నారనే ఆరోపణలున్నాయి. శుక్రవారం నాలుగు పాఠశాలలు మూసి ఉండడంపై కాంప్లెక్స్ హెచ్‌ఎం వివరణ కోరగా అందుబాటులోకి రాలేదు. ఇప్పటికైనా పాఠశాలలను కాంప్లెక్స్ హెచ్‌ఎంలు పర్యవేక్షించి సెలవు పెట్టిన ఉపాధ్యాయుల స్థానాల్లో మరొకరిని డిప్యూటేషన్‌పై పంపించి విద్యార్థులకు పాఠాలు సరిగా బోధించే విధంగా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.





మూసి ఉన్న పాఠశాలలు



బాధితునికి పరామర్శ

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

నిర్మల్‌రూరల్ మండలంలోని ముజ్గి గ్రామానికి చెందిన బద్దం నారాయణరెడ్డి ఇటీవల గుండె ఆపరేషన్ కావడంతో విషయం తెలుసుకున్న మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఆయన ఇంటి వెళ్లి యోగక్షేమాలు తెలుసుకున్నారు. అన్ని రకాలుగా అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఆయనతో పాటు అల్లోల మురళీధర్ రెడ్డి, నిర్మల్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఎంబరి గంగాధర్, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మెన్ రాజేందర్, పీఏసీఎస్ చైర్మన్‌లు రమణ రెడ్డి, కృష్ణ ప్రసాద్‌రెడ్డి, పాకాల రామచందర్, వినోద్,మాజీ ఎంపీటీసీ సంతోష్, మల్లేష్, శ్రీకాంత్ యాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



విద్యార్థులకు బెల్ట్, టైల్స్ అందజేత

నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని తర్నం గ్రామంలో కంటికే నవీన్ తను చదువుకున్న పాఠశాలలోనే తనకు తొచినంత విద్యార్థులకు ఏదైనా ఇవ్వాలన్న ఉద్యేశంతో విద్యార్థులకు శుక్రవారం బెల్టు, టైలు అందజేశారు. ఈ సందర్భంగా కంటికే నవీన్ మాట్లాడుతూ తాను ఇదే పాఠశాలలో చదువుకున్నానని, కొన్ని పరిస్థితుల వల్ల పైచదువులు చదువలేక పోయానని తెలిపారు. తాను ప్రస్తుతం వ్యవసాయం చేసుకుంటున్నానని తెలిపారు. విద్యార్థులు చదువులో రాణించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మాయ, విద్యా కమిటీ చైర్మెన్ స్రవంతి, విద్యా కమిటీ మాజీ చైర్మెన్ సుధాకర్, జుల సంతోష్, గ్రామస్తులు శంకర్, నరేష్ పాల్గొన్నారు.



బాల్య వివాహాలపై అవగాహన



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలో సాంఘిక సంక్షేమ పాఠశాలలో శుక్రవారం బాల్య వివాహలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ సతీష్ మాట్లాడుతూ పిల్లలు చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 సేవలను వినియోగించుకోవాలని సూచించారు. వారి హక్కులకు ఎటువంటి భంగం కలిగిన ఈ 1098 నెంబర్‌కి కాల్ చేసి సమాచారాన్ని అందించాలన్నారు. అదే విధంగా ప్రధానమంత్రి ఇచ్చిన పిలుపుమేరకు భారతదేశాన్ని బాల్య వివాహ ముక్తభారత్‌గా మార్చాలని అందరూ చదువుపై శ్రద్ధ చూపి తల్లిదండ్రులకు దేశానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం డీసీపీయు కౌన్సిలర్ మాట్లాడుతూ చిన్నపిల్లల పెండ్లిలతో జరిగే అనర్థాల గురించి పిల్లలలో గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పిల్లల భవిష్యత్ ప్రణాళికల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో డీసీపీయూ సోషల్ వర్కర్ రవికాంత్, డీసీపీయూ ఔట్ రిచ్ వర్కర్ అశ్విని, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కళాశాలలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ రఘు గణపతి పాల్గొని, అధ్యక్షత వహించారు. ప్రతి వ్యక్తి మాతృభాష మూలాలను మర్చిపోవద్దని, విద్యార్థులకు సూచించారు. ప్రతి ఒక్కరూ తమ మాతృభాషలో మాట్లాడాలని తెలియజేశారు. అలాగే తెలుగు విభాగం అధిపతి రేఖ మాట్లాడుతూ మాతృభాష గొప్పతనాన్ని దీని వెనుక బాషా అభిమానుల ప్రాణత్యాగం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో భాషా విభాగ అధిపతులు అనిత, పూనం, సాద్, సమీర్, నరేష్, సంతోషిని, భువన, బోధన సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సైన్స్ కళాశాలలో మాతృభాషా దినోత్సవం...

పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జె.సంగీత మాట్లాడుతూ మాతృభాషలను రక్షించుకుంటే మన సంస్కృతి పరిరక్షించబడుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కెప్టెన్ జగ్‌రామ్ అంతర్వేది, భాషోపాధ్యాయులు రడాపు సంతోష్ కుమార్, డీఎస్ చక్రవర్తి, గోలి సంజీవ్, నందకుమార్, రాధ, సుమయ్యా సుల్తానా, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల తనిఖీ : కలెక్టర్



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

మామడ మండలంలోని రాసిమెట్ల ప్రభుత్వ ఐటీడీఏ ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటశాల, సరుకుల గదులను పరిశీలించి, ప్రతి రోజు విద్యార్థులందరికీ మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని సూచించారు. పాఠశాల పరిసర ప్రాంతాలలో నిరంతరం మెరుగైన పారిశుధ్యాన్ని నిర్వహించాలని సూచించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ, పాఠశాలకు హాజరవుతూ వంద శాతం విద్యార్థులు తరగతులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలో నిర్వహిస్తున్న స్టాక్, అటెండెన్స్, తదితర రిజిస్టర్‌లను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. అన్ని తరగతుల విద్యార్థులకు ఎప్పటికప్పుడు పరీక్షలను నిర్వహిస్తూ వారి సామర్థ్యాలను పరీక్షించాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం వేళల ప్రత్యేక తరగతులకు నిర్వహించి, పరీక్షలకు సన్నద్ధం చేయాలన్నారు. పలు సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారిపై ప్రత్యేక శ్రద్ధను కనబర్చాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాలలో విద్యార్థులకు ఉపన్యాసం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్ట్స్ అండ్ కామర్స్‌లో ప్రభుత్వ పాలన శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో ఉపన్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాలన శాస్త్ర అసోసియేట్ ప్రొఫెసర్, నిర్మల్ (రిసోర్స్ పర్సన్) డా.యూ. గంగాధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికల పాత్ర అనే అంశం మీద విద్యార్థులకు అవగాహన కల్పించారు. దేశంలో ఎన్నికల ప్రాముఖ్యత పౌరుల బాధ్యతల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రఘు గణపతి, ప్రభుత్వ పాలన శాస్త్ర అధ్యాపకులు ఎస్.గోపాల్, బోధన సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు పరామర్శ

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



కాలిపోయిన ఇండ్లను పరిశీలిస్తున్న కలెక్టర అభిలాష అభినవ్

నవతెలంగాణ-పెంబి

మండలంలోని రాయదారి గ్రామంలో గురువారం జరిగిన అగ్ని ప్రమాద బాధితులను శుక్రవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులు, అధికారులతో కలిసి ప్రమాదానికి గురైన ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా బాధితులతో కలెక్టర్ మాట్లాడారు. అగ్ని ప్రమాద ఘటన దురదృష్టకరమన్నారు. ఈ ఘటనలో 8 ఇండ్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయని, బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. తక్షణ సాయం కింద రేపటిలోగా బాధితుల ఖాతాల్లోకి రూ.లక్ష జమ చేస్తామని తెలిపారు. వారికి నిత్యావసర సరుకులు, బట్టలను కలెక్టర్ అందజేశారు. బాధితులు యధాస్థితికి చేరుకునే వరకు వారికి భోజనం అందించాలని, రాత్రి బస చేసేందుకు ఏర్పాట్లను చేయాలన్నారు. బాధితులు నూతన ఇండ్ల కోసం అధికారులకు తమ వివరాలను అందజేయాలన్నారు. నూతన ఇండ్ల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ పరంగా అందాల్సిన అన్ని రకాల సహాయాన్ని అందిస్తామని తెలిపారు. అగ్ని ప్రమాద శకలాలను వీలైనంత త్వరగా తొలగించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అగ్ని ప్రమాద బాధితులు ఎటువంటి ఆందోళన చెందవద్దని, జిల్లా యంత్రాంగం వారికి అండగా ఉంటారని ధైర్యం చెప్పారు. అనంతరం గ్రామ ప్రభుత్వ పాఠశాలలో అగ్ని ప్రమాద బాధితులతో కలిసి కలెక్టర్ భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, మండల ప్రత్యేక అధికారి నరసింహారెడ్డి, డీఎస్ఓ కిరణ్ కుమార్, తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపీడీఓ రమాకాంత్, అధికారులు, సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రైతు పండించిన పంటలు పూర్తిస్థాయిలో కొనుగోలు

నవతెలంగాణ-తాంసి

రైతులు పండించిన పంటలను ప్రభుత్వం పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శుక్రవారం పంటల కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పంటల కొనుగోళ్ల ఎకరానికి మూడున్నర క్వింటాళ్లను మాత్రమే కొనుగోళు చేస్తుందని, పరిమితిని పెంచాలని రైతుల నుంచి వస్తున్న డిమాండ్ మేరకు కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. మండలంలో పర్యటించిన ఆయన రైతులతో పంటల దిగుబడి గురించి మాట్లాడారు. పంట క్షేత్రాలను పరిశీలించి, దిగుబడి వివరాలను తెలుసుకున్నారు. అంతకు ముందు హస్నాపూర్ రైతు వేదికలో రైతులతో సమావేశం నిర్వహించి, పంట దిగుబడి, అంతర పంటగా వేసిన వాటి దిగుబడులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ కంది పంట దిగుబడి అభిప్రాయాలను సేకరించేందుకు క్షేత్రస్థాయిలో పర్యటించడం జరిగిందన్నారు. చిన్న, సన్నకారు, పెద్ద రైతులతో సమావేశం ఏర్పాటు చేసి ఎకరానికి వచ్చిన దిగుబడి గురించి తెలుసుకున్నారు. తాంసి మండలంలో మేజర్ ఇరిగేటెడ్, అరిగేటెడ్ పొలాలున్నాయన్నారు. ఇక్కడ ఎకరానికి 6 నుంచి 8 ఎకరానికి దిగుబడి వస్తుందని రైతులు చెప్పారన్నారు. అదే విధంగా జొన్నలు కూడా దిగుబడి ఎక్కువగా వచ్చే అవకాశాలున్నాయని రైతుల ద్వారా తెలుసుకున్నామన్నారు. రైతుల వద్ద నుంచి సేకరించిన వివరాలను ప్రభుత్వానికి నివేధించడం జరుగుతుందని తెలిపారు. పరిమితి పెంచి కందులు కొనుగోళ్లు చేయాలని రైతుల తరపున ప్రభుత్వాన్ని కోరుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రవీందర్, సహకార సంఘం సొసైటీ సీఈఓ కేశవ్, మార్క్‌ఫెడ్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



రైతుల అభిప్రాయాలు తెలుసుకుంటున్న కలెక్టర్

పీహెచ్‌సీల ఆకస్మిక తనిఖీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గుడిహత్నూర్, ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను డీఎంహెచ్‌ఓ డా.నరేందర్ రాథోడ్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. గుడిహత్నూర్ పీహెచ్‌సీకి సంబంధించిన ఫార్మసిస్ట్ సకాలంలో విధులకు హాజరు కాలేదని గుర్తించారు. దీంతో ఫార్మసిస్ట్‌కు మెమో జారీ చేయడంతో పాటు ఆస్పత్రి పనివేళలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. అలాగే ఇచ్చోడ పీహెచ్‌సీలో, ఔషధశాల నిపుణుడు నిల్వ నమోదును ప్రమాణికంగాని నిర్వహించాలని ఆదేశించారు. అదేవిధంగా, వైద్య అధికారి ఎన్‌సీడీ, సికిల్‌సెల్ స్క్రీనింగ్‌ను మెరుగుపర్చాలని సూచనలు చేశారు. వైద్య అధికారులందరు ఆస్పత్రి విధులను క్రమశిక్షణగా నిర్వర్తించాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినట్లయితే కఠిన చర్యలు తీసుకోబడుతాయని హెచ్చరించారు. ఆయన వెంట ఎన్‌సీడీ అధికార డా. శ్రీధర్, సిబ్బంది ఉన్నారు.

ఎస్సీ ఉపకులాల మధ్య వైరుధ్యాలు

- మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్



నవతెలంగాణ-నిర్మల్

ఎస్సీ ఉపకులాల మధ్య వైరుధ్యాలు సృష్టిస్తున్న మంద కృష్ణ అని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ అన్నారు. శుక్రవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాల మహానాడు సమావేశం నిర్మల్ జిల్లా కేంద్రంలోని టీఎన్జీఓ సంఘ భవనంలో శుక్రవారం మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు కొంతం గణేష్ అధ్యక్షతన నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ పూర్తిగా మాదిగల పక్షంగా జరుగుతుందని అన్నారు. ఆగస్టు 1న దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును అనుసరించకుండా అశాస్త్రీయమైన 2011 జనాభా లెక్కలతో అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ ఆమోదం చేశారని విమర్శించారు. మంద కృష్ణ మాదిగ చేతిలో సీఎం రేవంత్‌రెడ్డి పావుగ మారి మాలల్ని అనచివేస్తున్నాడని అన్నారు. వాస్తవానికి ఎస్సీల జనాభా 20శాతం ఉందని దానికి అనుగుణంగా రిజర్వేషన్లను 20 శాతానికి పెంచిన తరువాత వర్గీకరణ ప్రయత్నాలు చేయాలని అన్నారు. మంద కృష్ణ ఎస్సీ ఉప కులాల మధ్య వైశ్యామ్యాలు సృష్టిస్తున్నారని అన్నారు. ఇది మంచి పద్ధతి కాదనీ అన్నారు. మార్చి నెలలో ఎస్సీ వర్గీకరణకు చట్టం తెస్తామన్న సీఎం విధానాన్ని మాలలు ఎండగట్టాలని ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర జైభీమ్ సైనిక్ దళ్ కన్వీనర్ పరిగిరి కనక రాజు, దాసరి రాజన్న, గజెల్లి లక్ష్మణ్, బెంజిమేన్, బొడ్డు లక్ష్మణ్, కుంటోల్ల వెంకటస్వామి, పురుషోత్తం, కొంతం మురళీధర్, అనిల్, బేర తిరుమలేష్, ఉదయ్, దాసరి రాజన్న, బండ రవి, గేరుగంటి రవీందర్, వేముల ప్రేమ్‌సాగర్, సత్తయ్య, బింగి సదానందం, సేపూరి సిద్దార్థ పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లు పున : ప్రారంభం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సర్వర్ సమస్య కారణంగా నిలిచిపోయిన సీసీఐ పత్తి కొనుగోళ్ల ప్రక్రియ పది రోజుల తరువాత పున : ప్రారంభమైంది. గురువారం మార్కెట్ యార్డుకు రైతులు పెద్ద ఎత్తున పత్తిని తీసుకువచ్చారు. పత్తి వాహనంతో పాటు, రైతు ఆధార్ కార్డును పరిశీలించి, తూకం వేశారు. పత్తితో ఉన్న వాహనంతో ఖాళీ వాహనం బరువు చూసే సమయంలో తప్పని సరిగా రైతు ఉండాలని అధికారులు చెప్పాడంతో రైతులు రెండు సార్లు జరిగే తూకం వద్ద ఉంటున్నారు. సర్వర్ పని చేయనికి కారణంగా దాదాపు పది రోజుల పాటు పత్తి పంటను ఇంటి వద్దనే పెట్టుకున్న రైతులు మార్కెట్ ప్రారంభం

కావడంతో పెద్ద ఎత్తున తరలివచ్చి విక్రయించారు. సీసీఐ అధికారులు నిబంధనలను పాటిస్తు ప్రక్రియను కొనసాగించారు. అయితే ఇటీవల మార్కెట్ కార్యదర్శి సస్పెండ్ అయిన తరువాత ప్రతి పత్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతనే కొనుగోళ చేసి ఎలాంటి ఇబ్బందులు లేవని తెలిసిన తరువాతనే జిన్నింగ్ మిల్లుకు పంపిస్తున్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

నవతెలంగాణ-కుభీర్

మండలంలోని గ్రామంలో జుమ్డ గ్రామంలో బాల్య వివాహం జరుగుతుందన్న సమాచారం మేరకు శుక్రవారం ఐసీడీఎస్, పోలీసు అధికారులు అడ్డుకున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... జుమ్డ గ్రామానికి చెందిన దేవుకే ప్రవీణ్‌తో భైంసా మండలంలోని మహాగాం గ్రామానికి చెందిన ఓ బాలికతో వివాహం జరిగే సమయంలో అధికారులు ఒక్కసారిగా బాలికకు 18 సంవత్సరాలు నిండకుండానే వివాహం చేస్తున్నారని అది నేరమని అన్నారు. దీంతో అధికారులు మాట్లాడుతూ మండలంలో ఆయా గ్రామంలో ఉన్న తల్లిదండ్రులు తమ పిల్లలకు 18సంవత్సరాల నిండిన తరవాతనే పెండ్లిలు చేయాలనీ తెలిపారు. లేని యెడల కేసులు నమోదు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

విద్యుద్ఘాతంతో ఒకరి మృతి

నవతెలంగాణ-పెంబి



విద్యుద్ఘాతానికి గురై ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలోని నాగపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని నాగపూర్ గ్రామానికి చెందిన రాపేని మైసయ్య(47) శుక్రవారం ఉదయం 7 గంటలకు తన పెద్ద కుమారుడు రాపెని మహేష్‌తో కలిసి నాగపూర్ గ్రామ శివారులోని అతను కౌలుకు చేస్తున్న మొక్కజొన్న చెనుకు కావాలికి వెళ్లాడు. అతను మొక్కజొన్న చేనుకు ఒక ఎల్‌టీ లైన్ కరెంట్ పోల్ నుంచి సింగల్ లీడ్ సర్వీస్ ద్వారా జీఏ వైర్‌తో రాత్రి వెలుతురు గురించి రెండు బల్బుకు కనెక్షన్ ఇచ్చాడు. రోజు ఉదయం 07.30 గంటలకు అతను వైర్‌ను పైకి లేపగా వైర్ అతని ఎడమ చేతికి తగిలి ప్రమాదవశాత్తూ కరెంట్ షాక్‌కు తగిలింది. అక్కడే ఉన్న తన కుమారుడు తండ్రిని రక్షించడానికి వెళ్లగా అతడికి కూడ కరెంట్ షాక్ తగిలి స్పృహ కోల్పోగా మైసయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య భీమక్క ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై హన్మండ్లు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

అభివృద్ధి నిరోధకుడు ఎమ్మెల్యే



నవతెలంగాణ-నిర్మల్

అభివృద్ధి నిరోధకుడు ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం సోన్ మండలంలో ఆయన పర్యటించారు. దారి పొడవు నా వృధాగా పడి ఉన్న అమృత్ పైపులను చూసి విస్తుర పోయారు. ఈ సందర్భంగా మాట్లాడారు. నిర్మల్ పట్టణ ప్రజల నీటి తిప్పలను పరిష్కరించేందుకు అమృత్ పథకం కింద రూ.62కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. యుద్ధ ప్రతిపాదికన పనులు చేపట్టాల్సి ఉండగా ఆ పనులు కాకుండా ఎమ్మెల్యే ఏలేటి అడ్డుపడటం శోచనీయమన్నారు. కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త అల్లోల మురళీధర్‌రెడ్డి, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మెన్ ధర్మాజీ రాజేందర్, నాయకులు కృష్ణా ప్రసాద్‌రెడ్డి, రమణారెడ్డి, వినోద్ కుమార్, శ్రీకాంత్ యాదవ్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబాలకు పరామర్శ



నవతెలంగాణ-పెంబి

మండలం రాయదారి గ్రామంలో గురువారం భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. 8 ఇండ్లు కాలిపోవడంతో పాటు ఇంట్లో వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. తీవ్ర దుఖంలో ఉన్న కుటుంబాలను రాసిమెట్ల గ్రామ ప్రజలు ప్రతి ఇంటింటికి తిరిగి విరాళాలు సేకరించి, వారికి తోచిన విధంగా ఒక కుటుంబానికి రూ.10వేల చొప్పున రెండు కుటుంబాలకు రూ.20వేల నగదు, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్



ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నిర్మల్ ఆధ్వర్యంలో శుక్రవారం చెన్నూరులో ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ బత్తుల రంజిత్ మాట్లాడుతూ రాబోయే అసెంబ్లీ సమావేశాలలో ఎస్సీ వర్గీకరణ బిల్లులో మాల, మాల ఉపకులాలకు జరిగిన అన్యాయంపై అసెంబ్లీ వేదికగా మాట్లాడాలని కోరారు. దానికి ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఆయన వెంట నాయకులు కూన రవి కుమార్, ఆకుల రమేష్, పులి అశోక్, గంగన్న, సుభాష్ ఉన్నారు.

విగ్రహ ప్రాణ ప్రతిష్టాపన

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

సోన్ మండలం లోకల్ వెల్మల్ గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీదేవి భూదేవి సహిత వెంకటేశ్వర స్వామి యంత్ర, శిఖర ప్రాణ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు మాజీ మంత్రిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అల్లోల మురళీధర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ కృష్ణ ప్రసాద్, ఎంబరి గంగాధర్, వినోద్, గంగారెడ్డి, రమణరెడ్డి, మల్లేష్, పాకాల రాంచందర్ పాల్గొన్నారు.

నవతెలంగాణ

కుమురంభీం ఆసిఫాబాద్

శనివారం | ఫిబ్రవరి 22, 2025 | www.navatelangana.com

రేపు టీజీ సెట్ పరీక్ష

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ గురుకులాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతిలో ప్రవేశాల కోసం ఈ నెల 23న తెలంగాణ గురుకుల సెట్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు పీటీజీ గురుకులం ప్రిన్సిపాల్ కారం భద్రయ్య తెలిపారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా కేంద్రంలో మొత్తం ఆరు పరీక్షా కేంద్రాలలో పరీక్ష జరుగుతుందన్నారు. విద్యార్థులు తమకు కేటాయించిన పరీక్ష కేంద్రానికి హాల్ టికెట్‌తో పాటు ఆదార్‌కార్డుతో ఉదయం 9 గంటల వరకు చేరుకోవాల్సి ఉంటుందన్నారు. ఆన్లైన్ లో హాల్ టికెట్లు అందుబాటులో ఉన్నాయన్నారు.

సిర్పూర్ (టీ) : తెలంగాణా గురుకులాల్లో ప్రవేశ పరీక్ష ఈ నెల 23న ఆదివారం ఉంటుందని జిల్లా సమన్వయ అధికారి డి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం పది పరీక్షా కేంద్రాలలో గురుకుల ప్రవేశ పరీక్షలు జరుగుతుందని, 2500 మంది విద్యార్థులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు తమ హాల్ టికెట్స్ తో పాటు బ్లూ, బ్లాక్ పేన్, తప్పులు ఉంటే ఆధార్ కార్డుతో ఉదయం 9 గంటల వరకు తమకు కేటాయించిన పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు.

విద్యతో ఉజ్వల భవిష్యత్తు

నవతెలంగాణ-తిర్యాణి

విద్యతో ఉజ్వల భవిష్యత్తు ముడిపడి ఉందని మండల విద్యాధికారి అంజయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని కేజీబీవీ విద్యాలయంలో ఇంటర్, ఎంపీహెచ్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. ప్రతి విద్యార్థి తమకంటూ ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని లక్ష్యాన్ని సాధించే దిశగా ప్రణాళిక బద్ధంగా కష్టపడి ఇష్టపడి కృషి చేయాలన్నారు. ప్రధానంగా బాలికలు ఇంటర్ వద్దనే ఆగిపోకుండా ఉన్నత విద్యను అభ్యసించి మండలానికి మంచి గుర్తింపు తీసుకురావాలని కోరారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. సాంస్కృతిక పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారి స్వప్న, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన



నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండల కేంద్రంలోని కేజీబీవీ బాలికల పాఠశాల విద్యార్థులకు షీ టీం ఎస్ఐ వెంకటేశ్వర్, భరోసా సెంటర్ మహిళా ఎస్ఐ తిరుమల, డబ్ల్యూసీపీ రమాదేవి ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలపై హింస, ఈవిటీజింగ్ ఎవరైనా పాల్పడితే వెంటనే షీటీంను సంప్రదించాలన్నారు. ముఖ్యంగా సామాజిక మాధ్యమాలు ఫేస్‌బుక్, వాట్సప్, ఇన్స్‌స్టా గ్రామ్ వంటి వాటిని వినియోగించడంలో చాలా జాగ్రత్తగా ఉండాలని సూచిస్తూ ఫోటోలు, వీడియోలు పోస్ట్ చేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించిన అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మహిళలకు రక్షణ కల్పించడం కోసమే షీటీమ్‌లు, భరోసా సెంటర్ పనిచేస్తున్నాయన్నారు. ఏదైనా అత్యవసర సమయంలో డయల్ 100కు, సైబర్ క్రైమ్‌కి గురైతే 1930కు డయల్ చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ శ్రీజ నందిని, ఏఎస్ఐ యాదవ్ పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి



నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి శుక్రవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బోయపల్లిలో పట్టభద్రులను కలిశారు. తాండూర్ మండలంలోని బోయపల్లి గ్రామంలోని గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న పట్టబద్రులను కలిసి నియోజకవర్గంలోని పలు అంశాలపై చర్చించారు. మొదటి ప్రాధాన్యత ఓటు బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డికి వేయమని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి అసెంబ్లీ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి క్యాతం వెంకటరమణ, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణదేవరాయలు, మండల ఎన్నికల సహ ఇన్‌చార్జి న్యాయవాది నల్లుల సంగీత, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గోమాస కమల, మండల ప్రధాన కార్యదర్శి పుట్ట కుమార్, మండల ఉపాధ్యక్షుడు సిద్ధం మల్లేష్, చోక్కాల నాగభూషణం, బోయపల్లి బూత్ అధ్యక్షుడు కొమ్మ కొమురెల్లి, మహిళా మోర్చా నాయకురాలు స్రవంతి పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించడంలో నిర్లక్ష్యం వీడాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య



నవతెలంగాణ-లక్షెట్టిపేట

ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో నిర్లక్ష్యం వీడాలని మంచిర్యాల జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య తెలిపారు. శుక్రవారం సెక్టోరల్ అధికారి శ్రీ చౌదరి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ముల్కల్లగూడను సందర్శించారు. దీనిలో భాగంగా పాఠశాల మౌలిక సదుపాయాలు టాయిలెట్‌లు సరిగా లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. తరగతి గదులు, తాగునీరు, మధ్యాహ్న భోజనం, తరగతి గది పరిశీలన, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, తదితర అంశాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఉపాధ్యాయులందరూ సమయపాలన పాటించాలని, పాఠశాలలో నెలకొన్న సమస్యను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్టోరల్ అధికారి చౌదరి, మండల విద్యాధికారి హెలెన్ డారతి పాల్గొన్నారు.

గుడిపేట వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

నవతెలంగాణ-హాజీపూర్

మండలంలోని గుడిపేట వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రెండు ద్విచక్ర వాహనాలను కారు ఢీకొనడంతో లక్షెట్టిపేటలోని గురుకుల పాఠశాలలో మ్యూజిక్ టీచర్‌గా పనిచేస్తున్న శివప్రియ దుర్మరణం చెందగా.. చెన్నూర్ మండలంలోని లింగంపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి నయీముద్దీన్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. కాగా కారు డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు స్థానికులు తెలిపారు.



తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వేసవికాలం సమీపిస్తున్నందున జిల్లాలోని మున్సిపాలిటీల పరిధిలో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలిసి ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపల్ అధికారులతో తాగునీరు, పారిశుధ్యం, ఆస్తి పన్ను వసూలు అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వేసవికాలంలో మున్సిపాలిటీల పరిధిలో ఎలాంటి తాగునీటి సమస్య లేకుండా ముందస్తు కార్యాచరణతో అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. మిషన్ భగీరథ పైప్ లైన్లు, చేతి పంపుల మరమ్మత్తులు చేపట్టాలని, అవసరమైన ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణలో భాగంగా మున్సిపాలిటీలలోని ప్రతి వార్డులో ప్రతిరోజు తడి, పొడి చెత్తలను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలని, అంతర్గత రహదారులు, మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరిచి బ్లీచింగ్ పిచికారి చేయించాలన్నారు. ముఖ్యంగా వాణిజ్య సముదాయాలు, హోటళ్ళు, కూడళ్ళు, వ్యాపార ప్రాంతాలలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆసిఫాబాద్ మున్సిపల్ పరిధిలో 20 వార్డులు, కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో 30 వార్డులు ఉన్నాయని, ప్రతి రోజు బృందాల వారీగా ఆస్తి పన్ను వసూలు చేయాలని, మార్చి నెల చివరి వరకు 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. వాణిజ్య సముదాయాలలో ఎక్కువగా బకాయి ఉన్న వాటిపై ప్రత్యేక దృష్టి సారించి వసూలుకు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించాలన్నారు. ఆ దిశగా సూపర్ వైజర్లు, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు, వార్డు అధికారులు ప్రతిరోజు ప్రణాళికాబద్ధంగా ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ మున్సిపల్ కమిషనర్ భుజంగరావు పాల్గొన్నారు.



మున్సిపల్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

చింతలమానేపల్లి : తాగునీటి సరఫరాకు ఇబ్బందులు ఏర్పడకుండా ముందస్తుగా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని ఎంపీడీవో సుధాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో తాగునీటి సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మిషన్ భగీరథ, గ్రామీణ ఉపాధి హామీ పథకం అధికారులు, తాగునీరు, ఉపాధి పనులు, పైలట్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల ప్రారంభం తదితర అంశాలపై సమీక్షించారు. గ్రామ పంచాయతీల్లో, గిరిజన గ్రామాలలో మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందించేలా చూడాలని, ఏమైనా సమ స్యలు, పైప్‌లైన్ లీకేజీలు, మోటార్లు చెడిపోయి ఉంటే మరమ్మతులు చేయించాలని అన్నారు. ఆవాస ప్రాంతాలకు పూర్తి స్థాయిలో తాగునీరు అందించేలా దష్టి సాధించాలన్నారు. ఉపాధి పనులకు కూలీల హాజరు శాతం పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో జాగ్రత్తలు, వసతులపై దృష్టి సారించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశానికి ఏఈ ఉదయ్ విర్, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.



కెరమెరి : తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ అంజద్ పాషా అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. వేసవికాలం నేపథ్యంలో ప్రజల తాగునీటి సరఫరాకు ప్రణాళిక రూపొందించుకుని చర్యలు చేపట్టలన్నారు. పారిశుధ్య పనులను ఎప్పటికప్పుడు చేపట్టి వీదుల్లో అపరిశుభ్రత నెలకొనకుండా చూసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ గృహానికి అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఏఈ విశ్వేశ్వరరావు, ఐటీడీఏ, నజాముద్దీన్, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, వివిధ గ్రామపంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.



మూగజీవాల రక్షణకు కృషి చేయాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే



కార్యాలయానికి వచ్చిన కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా సన్మానిస్తున్న పశుసంవర్ధక శాఖ అధికారులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో మూగజీవాల రక్షణకు సిబ్బంది నిరంతర చర్యలు తీసుకోవాలని, వాతావరణ మార్పులకు అనుగుణంగా అవసరమైన శస్త్ర చికిత్సలను సకాలంలో అందించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పశుసంవర్ధక, పశు వైద్య కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి భవన పరిసరాలు, రిజిస్టర్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పశు వైద్య కార్యాలయానికి సంబంధించి ఖాళీ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేసి రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. మూగజీవాలకు సకాలంలో వైద్య చికిత్సలు అందించాలని, నిర్ణీత సమయంలో వాక్సినేషన్ చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. నూతనంగా 7 గురు పశు వైద్యులు రావడంతో జిల్లాలో పశు వైద్యుల కొరత లేదన్నారు. మారుమూల గ్రామాలలో సైతం శిబిరాలు నిర్వహించాలని, వేసవికాలం దష్ట్యా ఎండ తీవ్రతల వలన పశువులు వ్యాధుల బారిన పడే అవకాశం ఉన్నందున స్థానికంగా అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని పశు వైద్య అధికారులను ఆదేశించారు. జాతీయ పశుగణన ప్రక్రియ వివరాలను అడిగి తెలుసుకొని నిర్ణీత గడువులోగా లక్ష్యాలను పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి సురేష్, పశు వైద్యాధికారులు మురళీకష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో పౌష్టికాహారం అందించాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అంగన్‌వాడీల్లో పిల్లలు, మహిళలకు సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. శుక్రవారం మండలంలోని సాలెగూడ అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి రిజిస్టర్లు, నిత్యవసర సరుకులు, పరిసరాలతో పాటు అంగన్వాడీ కేంద్రం వద్ద చేపడుతున్న నవీకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలు, గర్భిణీలు, బాలింతలు, కిషోర బాలికల సంక్షేమంకై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పిల్లలు, మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కషి చేస్తుందని తెలిపారు. పిల్లల మానసిక, శారీరక ఎదుగుదలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ లోపం కలిగిన పిల్లలను గుర్తించి వారికి సకాలంలో పౌష్టిక ఆహారం, మందులను అందించి సాధారణ స్థితికి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. గర్భిణులకు గర్భస్థ సమయంలో తీసుకోవలసిన పౌష్టిక ఆహారంపై అవగాహన కల్పించాలన్నారు.



అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించిన అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

బూరుగూడ పాఠశాల తనిఖీ

మండలంలోని బూరుగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం నాణ్యత వివరాలను పరిశీలించారు. విద్యార్థులకు నూతన మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారాన్ని సకాలంలో అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున పాఠశాల ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించి పరీక్షలకు సన్నద్ధం చేయాలన్నారు. 10వ తరగతి వార్షిక పరీక్షలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా విద్యార్థులచే ప్రణాళికాబద్ధంగా చదివించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్ పాల్గొన్నారు.

నర్సరీ కార్మికుల వేతన పెంపు పట్ల హర్షం

నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీలలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాల అమలు, సీఎం పీఎఫ్ అమలు చేస్తూ సింగరేణి యాజమాన్యం సర్క్యులర్ జారీ చేయడం పట్ల తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం తరపున హర్షం వ్యక్తం చేశారు. నర్సరీ కార్మికులు వివిధ చేసిన పోరాట ఫలితంగా ఈ హక్కు సాధించబడిందన్నారు. కృషి చేసిన సంఘాలకు ఈ పోరాటంలో పాల్గొన్న నర్సరీ కార్మికులకు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

నిర్మల్ : వేసవి కాలంలో ప్రజలకు త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమ్మర్ యాక్షన్ ప్లాన్ పై సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఎండాకాలంలో అటవీ ప్రాంతాలలో అగ్ని ప్రమాదాలు జరగకుండా అటవీ, సంబంధిత శాఖల అధికారులు అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని మున్సిపాలిటీలలోని ఆయా వార్డులలో త్రాగునీటి కొరతను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే కమ్యూనిస్టుల లక్ష్యం

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దుర్గం దినకర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజల పక్షాన పోరాడి, సమస్యల సాధనకు కృషి చేయడమే కమ్యూనిజం లక్ష్యమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దుర్గం దినకర్ అన్నారు. రెడ్ బుక్ డే సందర్భంగా జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కోట శ్రీనివాస్‌తో కలిసి పుస్తక పఠనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1848 ఫిబ్రవరి 21న కమ్యూనిస్టు ప్రణాళిక ప్రజల ముందు ఉంచబడిందని, ఇప్పటి వరకు ప్రజా సమస్యల పరిష్కారానికి కమ్యూనిజమే మార్గమన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సరైన పోరాటాన్ని చేస్తూ అనేక దేశాలలో ఎర్రజెండా అధికారంలోకి వస్తుందన్నారు. దానికనుగుణంగా మన ప్రాంతంలో కూడా వామపక్షాల వైపు యువత నిలబడాలని, ఆ రకంగా అధ్యయనం చేయాలని ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు రాజేందర్, గొడిసెల కార్తిక్, గేడం టికానంద్, నాయకులు శ్రావణి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీగా హరికృష్ణను గెలిపించాలి



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రసన్న హరికృష్ణకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పిలుపునిచ్చారు. శుక్రవారం మండలకేంద్రంలో పట్టభద్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మాట్లాడుతూ పట్టభద్రుల తరపున మండలిలో ప్రశ్నించే గొంతుక ప్రసన్న హరికృష్ణ అని, చదువుకున్న విద్యావేత్త ఎంతో మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిన హరికృష్ణకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అన్నారు. పార్టీలకు అతీతంగా ప్రసన్న హరికృష్ణకు మద్దతు లభిస్తోందని, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పట్టభద్రులను కోరారు. కార్యక్రమంలో నాయకులు చౌదరి తిరుపతి, చలం, మల్లేష్, రవి, సుధాకర్ పాల్గొన్నారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌లకు విద్యార్థుల ఎంపిక





నవతెలంగాణ-పెంచికల్‌పేట్

చెడ్వాయి గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ఎనిమిదవ తరగతి విద్యార్థులు పొట్టె అనూష, పొట్టె శ్రీకర్ నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌లకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్‌బాబు తెలిపారు. గత సంవత్సరం నవంబర్ 24వ తేదీన నిర్వహించిన పోటీ పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి వీరు మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారని, ఈ విద్యార్థులకు నాలుగు సంవత్సరాల పాటు ప్రతి ఒక్కరికి రూ.12 వేల చొప్పున స్కాలర్‌షిప్ లభిస్తుందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు రాకేష్, సంతోష్, చాంద్‌పాషా, రాజకమలాకర్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం విద్యార్థులు ఇద్దరిని అభినందించారు.

ఆహార కల్తీలపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని హోటల్లు, బేకరీలు, స్వీట్ హౌస్‌లు, కిరాణా దుకాణాలు ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో జరుగుతున్న ఆహార కల్తీలపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్ డిమాండ్ చేశారు. ఆహార కల్తీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌తో కలిసి కలెక్టరేట్ ఏఓ మధుకర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆహార నియంత్రణ అధికారి జిల్లాలో తనిఖీలు చేయాల్సి ఉన్నప్పటికీ అవేవీ జరగడం లేదన్నారు. దీంతో కల్తీ ఆహారాలతో గిరిజన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆహార కల్తీ నియంత్రణాధికారి నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవడంతో పాటు, ఆహార కల్తీని నివారించాలని కోరారు. ఉన్నత అధికారుల స్పందించకుంటే రానున్న రోజుల్లో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరపరలో అంతరాయం

నవతెలంగాణ-రెబ్బెన

మరమ్మతులో భాగంగా మండలంలోని గౌడ్స్ కాలనీలో శనివారం ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 3:00 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు ఏఈ ఇమ్రాన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయాన్ని గమనించి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నవతెలంగాణ
మంచిర్యాల
శనివారం | ఫిబ్రవరి 22, 2025 | www.navatelangana.com

స్వయం సమృద్ధికి కృషి చేయాలి

నవతెలంగాణ-జైపూర్



బ్యాటరీ వాహణాలు, సోలార్ విద్యుత్ వినియోగం క్రమంగా పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో లిథియం, కోబాల్ట్, నికెల్ వంటి కీలక ఖనిజాలకు అనూహ్యంగా డిమాండ్ ఏర్పడుతుంది. ఈ విషయంలో భారత్ స్వయం సమృద్ధి సాధించడానికి ప్రభుత్వరంగ సమస్థలు కృషి చేయాల్సిన అవసరమని సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్ నాయక్ అన్నారు. హైదరాబాద్‌లో కీలక ఖనిజాలపై క్రిటికల్ మినరల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. 2070 నాటికి భారత్ ను కర్బన్ ఉద్గార రహిత నెట్ జీరో దేశంగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇది నెరవేరాలంటే దేశీయ ఖనిజ పరిశ్రమల వారు క్రిటికల్ మినరల్స్ (కీలక ఖనిజాల) ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరమని అన్నారు.

ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు

నవతెలంగాణ-తాండూర్



ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లను తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్ ఎంపీడీఓ శ్రీనివాస్ సీఐ కుమారస్వామితో కలిసి పరిశీలించారు. మండలంలోని తాండూర్ హైస్కూల్లో ఏర్పాటు చేయనున్న పోలింగ్ బూత్‌ను పర్యవేక్షించారు. పోలింగ్ బూత్ వద్ద వసతి సౌకర్యాల ఏర్పాట్లను పరిశీలించారు. హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన వంటలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని సూచించారు. వారితో తాండూర్ ఎస్ఐ కిరణ్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్ ఉన్నారు.

డప్పు కొడుతూ పంచాయితీలో పన్ను వసూలు



నవతెలంగాణ-తాండూర్

మండలంలోని తాండూర్ పంచాయతీలో అధికారులు శుక్రవారం వినూత్న రీతిలో డప్పు కొడుతూ ఇంటి పన్ను వసులు చేశారరు. తాండూర్ గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్ ఇంటింటికి తిరుగుతూ ఇంటి పన్ను వసూలు కార్యక్రమంలో పాల్గొన్నారు. పన్నుల వసూలు ద్వారా పంచాయతీలలో జీపీలో చేపట్టిన అభివద్ధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పన్ను వసూలు కోసం మండలంలోని గ్రామ పంచాయతీలలో స్పెషల్ డ్రైవ్ జరుగుతుందనీ తెలిపారు. ప్రజలు ఇంటి పన్ను చెల్లించి పంచాయతీల అభివృద్ధికి సహకరించాలని కోరారు. పెండింగ్ బకాయిదారుల వివరాల జాబితాను రూపొందించేందుకు తగిన కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని తెలిపారు. మార్చి నెలాఖరు వరకు వంద శాతం పన్నులు వసూలు చేయాలని కార్యదర్శులకు సూచించారు. ప్రజలు సకాలంలో ఇంటి పన్ను చెల్లించి గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. మండలంలోని పంచాయతీలలో ఇప్పటివరకు 48 శాతం ఇంటి పన్నులు వసూలు అయ్యాయని తెలిపారు. మార్చి చివరి నాటికి 100 శాతం పన్నుల వసూలుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓ దొండ దివాకర్ పాల్గొన్నారు.

23న టీజీ సెట్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-లక్షెట్టిపేట

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ప్రవేశం కోసం ఈ నెల 23వ తేదీన టీజీసెట్ నిర్వహించనున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపల్ కె రమా కల్యాణి తెలిపారు. 5వ తరగతి ప్రవేశ పరీక్షకు 340 మంది, 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు 340 మంది చొప్పున 680 మంది పరీక్ష కేంద్రానికి హాజరు కానున్నారని, పరీక్ష నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ప్రిన్సిపల్ తెలియజేశారు. పరీక్ష రాసే విద్యార్థులు హాల్ టికెట్‌తో పాటు నీలిరంగు, నలుపు రంగు బాల్ పాయింట్ పెన్నులను, పరీక్ష ప్యాడ్‌ను పరీక్ష కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. పరీక్ష ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు ఉంటుందని చెప్పారు. విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని కోరారు.

తెలంగాణ జనసమితి ఇన్‌చార్జిగా హరిప్రసాద్

నవతెలంగాణ-తాండూర్



తెలంగాణ జన సమితి పార్టీ బెల్లంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జిగా బెల్లంపల్లికి చెందిన మందుకుల హరి ప్రసాద్ నియామకమయ్యారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎమ్మెల్సీ కోదండరాం చేతుల మీదుగా నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ పార్టీ అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానని తనపై నమ్మకంతో బెల్లంపల్లి నియోజకవర్గం ఇన్‌చార్జిగా నియమించినందుకు రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ బాబన్న, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు ఎన్ రామచంద్ర రెడ్డి, కార్యదర్శి గోనేల శ్రీనివాస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీ చైతన్య పాఠశాలలో ప్రీ ప్రైమరీ వార్షికోత్సవం



నవతెలంగాణ-లక్షెట్టిపేట

పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో ప్రీ ప్రైమరీ వార్షికోత్సవ క్రీడా పోటీలు(ఆన్యువల్ స్పోర్ట్స్ మీట్) శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా ప్రీ ప్రైమరీ విద్యార్థుల కోసం ప్రత్యేక ఆటల పోటీలు నిర్వహించారు. పరుగుపందెం, మ్యూజికల్ చైర్, బాల్, 'బాల్' బ్యాలెన్స్ క్రీడలు నిర్వహించారు. పిల్లల తల్లిదండ్రులను ఆహ్వానించి వారికి కూడ ఆటలు నిర్వహించారు. గెలిచిన వారికి పాఠశాల ప్రిన్సిపాల్ ఎం అశ్విని, పీఈటీ రాజేందర్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అకాడమిక్ డిన్ వి.శ్రీనివాస్, పీపీటీ ఇన్‌చార్జి శిరీష, వ్యాయామ ఉపాధ్యాయులు కిషన్ పాల్గొన్నారు.

పేదింటి ఆడపడుచు వివాహానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని చింతగూడ గ్రామం నిరుపేద కుటుంబానికి చెందిన సంపంగి అంజన్న లక్ష్మి దంపతుల కూతురు రజిత వివాహానికి గ్రామస్తులు ఆర్థిక సాయం చేశారు. శుక్రవారం మాజీ సర్పంచ్ అరె శిరీశ్, మాజీ వైస్ ఎంపీపీ వినయ్ కుమార్ యువతి కుటుంబీకులకు పెళ్లి ఖర్చు నిమిత్తం రూ.15వేల నగదు అందజేశారు. ఆర్థిక సాయం అందజేసిన వారికి అంజన్న లక్ష్మీలు కతజ్ఞతలు తెలిపారు.

పులి వచ్చింది.. ఆందోళన మొదలైంది..!

- దాంపూర్ రక్షిత అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న పులి
- భయాందోళనకు గురువుతున్న పరిసర గ్రామాల ప్రజలు
- అప్రమత్తం చేస్తున్న అటవీ శాఖ అధికారులు



రైతుకు నష్టపరిహారం చెక్కును అందజేస్తున్న అటవీ అధికారులు

నవతెలంగాణ-జైపూర్

దాంపూర్ రక్షిత అటవీ ప్రాంతానికి వచ్చి చేరిన పెద్దపులి వచ్చీ రావడంతోనే వేట మొదలెట్టింది. గ్రామ సరిహద్దుల్లో మేకల బాపుకు చెందిన బర్రె దూడను వేటాడంతో గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల వారు ఆంధోళన చెందుతున్నారు. రెండు రోజుల క్రితం కాగజ్‌నగర్ డివిజన్ బెజ్జూర్ వైపు నుంచి దాంపూర్ రక్షిత అటవీ ప్రాంతానికి వచ్చినట్లు అటవీ అధికారులు పేర్కొంటున్నారు. దాంపూర్ రక్షిత అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న పెద్దపులి బీ1గా తెలియవస్తుండగా కాగజ్‌నగర్ కేంద్రంగా పెద్దపులుల రాకపోకలు కొనసాగుతుంటాయని పేర్కొంటున్నారు. దాంపూర్ రక్షిత అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న పెద్దపులి ఆడ పులిగా అభిప్రాయడుతున్నారు. కాళేశ్వరం ఏరియా నుంచి మంచిర్యాల, చెన్నూర్ డివిజన్ అటవీ ప్రాంతంలోకి మరో మగ పులి వచ్చే అవకాశాలు సూచనాప్రాయంగా పేర్కొంటున్నారు. దీనికి తోడు బెల్లంపల్లి ఏరియాలో మరో పెద్దపులి సంచరిస్తుండగా ఇక్కడకు వచ్చిన పెద్దపులి కాగజ్‌నగర్ డివిజన్ బెజ్జూరు ఏరియా నుంచి నేరుగా నెన్నెల మీదుగా దాంపూర్ ఏరియాకు వచ్చి చేరిందని తెలుపుతున్నారు. రెండు రోజు క్రితం వచ్చిన ఈ పెద్దపులి ఇంకా ఇక్కడనే ఉన్నట్లుగా పేర్కొంటున్నారు. ఉమ్మడి జిల్లా పరిధి వివిధ ఏరియాల్లో పులి సంచారం కొనసాగుతుందని మేటింగ్ సీజన్ కానందున చుట్టం చూపుగా పులుల రాకపోకలు సహజంగా కొనసాగుతుంటాయని పేర్కొంటున్నారు. మగ ఆడ రెండు పులులు కలిస్తే తప్పా స్థిర నివాసమై ఉండటానికి అవకాశాలు తక్కువని చెప్పుకొస్తున్నారు. కాళేశ్వరం వైపు నుండి మగ పులి వస్తున్నట్లు అందతున్న సంకేతాలను బట్టి అప్పటి వరకు దాంపూర్ ఏరియాలో ఉన్న పులి ఇక్కడే ఉంటే ఈ రెండు మరి కొంత కాలం ఇక్కడ ఉండటానికి అవకాశం ఉన్నట్లు పేర్కొంటున్నారు. అవసరమైత ఈ రెండు పులులు స్థిర నివాసమై ఉండటానికి కూడా అవకాశాలు లేకుండాపోలేదని అభిప్రాయపుడుతున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో 10 నుండి 15 పులులు వివిధ ఏరియాల్లో సంచరిస్తున్నట్లు తెలివయస్తోంది. పెద్దపుల రాకపోకలను స్వాగతించాలే తప్పా వాటికి ఎలాంటి హానీ తలపెట్టకూడదని అటవీ అధికారలు హెచ్చరిస్తున్నారు. పులుల సంచారాన్ని ఎప్పటికప్పుడు పసిగడుతూ వాటి కదలికలకు అనుగుణంగా రక్షణ చర్యలు చేపట్టడం జరుగుతుందని పేర్కొంటున్నారు. పులుల రాకపోకలు సర్వసాధారణమైనా వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని మంచిర్యాల రేంజ్ ఆఫీసర్ రత్నాకర్ సూచించారు. కాగజ్‌నగర్ ఏరియా నుంచి చెన్నూర్, మంచిర్యాల డివిజన్ల పరిధిలోకి అప్పుడప్పుడు వచ్చిపోతుంటాయని అటవీ సరిహద్దు గ్రామాల వారు అటవీ ప్రాంతాలకు వెల్లకుండా జాగ్రత్తపడాలని తెలిపారు. అటవీ సరిహద్దులో పంటలు సాగు చేసిన రైతులు, మామిడి తోటల్లో కాపలాదారులు చీకటిపడే ముందు ఇంటికి చేరుకోవాలని పులి అనవాళ్లు కన్పిస్తే వెంటనే స్థానిక అటవీ అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. పులి దాడిలో పశువును నష్టపోయిన రైతుకు ఆర్థిక సాయం రూ. 15 వేలు బాధిత రైతు మేకల బాపుకు శుక్రవారం అందజేసినట్లు మంచిర్యాల రేంజ్ ఆఫీసర్ రత్నాకర్ తెలిపారు. పులి దాడి చేసిన 24 గంటల వ్యవధితో బాధిత రైతుకు శాఖ పరంగా ఆర్థిక తోడ్పాటు అందించడం జరిగిందని తెలిపారు.

అక్షరాస్యత మండలంగా తీర్చిదిద్దాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-కాసిపేట



నిరక్షరాస్యుల అభ్యాసన కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

జిల్లాలోని కాసిపేట మండలాన్ని 100 శాతం అక్షరాస్యత మండలంగా తీర్చిదిద్దేందుకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం మండలం ముత్యంపల్లి రైతు వేదికలో జిల్లా వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిరక్షరాస్యుల అభ్యాసన కేంద్రాలు, కుట్టు శిక్షణ కేంద్రాలను జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, ఓరియంట్ సిమెంట్ ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్ ఆనంద్ కులకర్ణితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండలంలో 100 శాతం అక్షరాస్యత మండలంగా తీర్చిదిద్దడంలో ఓరియంట్ సిమెంట్ యాజమాన్యం ద్వారా అక్షరాస్యత, కుట్టు శిక్షణ కేంద్రాలకు అవసరమైన పుస్తకాలు, పలకలు, నోట్ పుస్తకాలు, పెన్సిల్, కుట్టు మిషన్లను అందించడం అభినందనీయమని అన్నారు. మండలంలో 3 వేల 462 మంది నిరక్షరాస్యలను 100 రోజులలో చదవడం, వ్రాయడం నేర్పించి అక్షరాస్యులుగా మార్చడానికి వాలంటీర్లను గుర్తించి తగు చర్యలు తీసుకోడం జరుగుతుందని, ఈ కేంద్రాల ద్వారా చదువు నేర్చుకోవడంతో పాటు ఆర్థికంగా ఎదిగేందుకు కావలసిన నైపుణ్యాలను పెంపొందించడం జరుగుతుందని తెలిపారు. రానున్న రోజుల్లో మగ్గం పనులు, క్యాండిల్ తయారీ, అగరబత్తుల తయారీపై శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. మార్చి 31వ తేదీ తరువాత కాసిపేట మండలంలో పేరుతో సంతకం చేయలేని వారు ఎవరు లేకుండా చూడాలని అన్నారు. ఓరియంట్ సిమెంట్ ఫ్యాక్టరీ జీఎం కులకర్ణి మాట్లాడుతూ అభ్యాసన, కుట్టు శిక్షణ శిక్షణ కేంద్రాలలో తమను భాగస్వామ్యం చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. అనంతరం మండలంలోని కోనూరు గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా నిర్మించిన అంకతి సత్తయ్య పశువుల పాక, కంపోస్ట్ పిట్ను సందర్శించి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రహారీగోడ నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రహారీగోడ నిర్మాణ పనులను వారం రోజుల్లోగా పూర్తి చేయాలని, సామాగ్రి బిల్లులు, వేతనాలను వెంటనే విడుదల చేసే విధంగా ఎఫ్‌టీఓ చేయడం జరిగిందని తెలిపారు. తాటిగూడ గ్రామంలోని దిశ ఆదర్శ పాఠశాలలో ఉపాధి హామీ పథకం క్రింద చేపట్టిన ప్రహారీగోడ నిర్మాణ పనుల సందర్శనతో పాటు అదే పాఠశాలలో అంగన్వాడీ భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, జిల్లా సంక్షేమాధికారి రౌఫ్ ఖాన్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, విద్యాశాఖ నాణ్యతా సమన్వయకర్త సత్యనారాయణ మూర్తి, సీడీపీఓ స్వరూపారాణి, తహసీల్దార్ భోజన్న, మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ సింగ్, మండల విద్యాధికారి వెంకటేశ్వర స్వామి పాల్గొన్నారు.

మైనింగ్ స్టాఫ్ సమస్యల పరిష్కారానికి కృషి



కార్మికులతో కలిసి మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

నవతెలంగాణ-జైపూర్

సింగరేణి మైనింగ్ స్టాఫ్ సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఏఐటీయూసీ బెల్లంపల్లి రీజియన్ మైనింగ్ స్టాఫ్ కార్యదర్శి వంగరి రాజేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం ఇందారం-1ఏ గనితో పాటు ఇందారం ఓపెన్‌కాస్ట్ గని సందర్శించిన ఆయన ఇక్కడి మైనింగ్ స్టాఫ్ సభ్యుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా 2016 బ్యాచ్ జేఎంఈటీల పదోన్నతులు, చార్జ్ అలవెన్స్, బంగ్లా కీప్ ఆఫ్ అలవెన్స్, ఓసీ కౌన్సిలింగ్‌లో పాల్గొన్న ఓవర్‌మెన్‌ల ఓసీ రిలీవింగ్ విషయంలో ఎమ్మెల్సీ కోడ్ ముగిసిన అనంతరం యాజమాన్యంతో మాట్లాడుతామని అన్నారు. ఈ విషయమై ఈ నెల 22న సీసీసీలో గల నర్సయ్య భవన్‌లో సాయంత్రం 5 గంటలకు ప్రత్యేకంగా సమావేశం కానున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథిలుగా రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, జనరల్ సెక్రెటరీ రాజ్‌కుమార్, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ ఏరియా బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, ఉపాధ్యాక్షులు కొట్టె కిషన్ రావు సమావేశంలో పాల్గొంటున్నట్లు తెలిపారు.

తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి మండల కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-జన్నారం



తిరుపతి



ఎల్లయ్య

తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి మండల కార్యవర్గాన్ని కోర్ కమిటీ సభ్యులు వ్యవస్థాపక అధ్యక్షుడు కల్లెడ భూమయ్య, ఎరుకల రాజుగౌడ్, మల్లికార్జున్, అమరకొండ తిరుపతి, పాలాజీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షుడిగా మగ్గిడి తిరుపతి, ఉపాధ్యక్షుడిగా తుడుం సునీల్, అరే శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి దుమల్ల ఎల్లయ్య, దుంపల జీవన్, వర్కింగ్ ప్రెసిడెంట్లు కోర కంటి శంకర్, మెరుగు సత్యా గౌడ్, అగ్గిసెట్టి నర్సింగ్, కోశాధికారి సంతపురి రమేష్, కార్యదర్శులుగా జాడి సురేందర్, కోడి జుట్టు రాజేష్, దండవేణి శ్రీధర్, స్పీకర్ కూనారపు భీమరాజు, ప్రచార కార్యదర్శులు రంగు రాజా గౌడ్, అంబడిపెల్లి కిరణ్, ఉప్పు రాజారెడ్డి, అధికార ప్రతినిధిలు వేముల నగేష్, ఆలుగొట్టు దీపక్, మీడియా ప్రతినిధులు ఎరుకల అంజగౌడ్, పులిశెట్టి లవన్ కుమార్, రాగుల మహేష్, ముఖ్య సలహాదారులు భూతం శ్రీనివాస్, కొండకూరి నరేష్, సలహాదారులు గాంధారి మహేష్, లింగాల వెంకటేష్, ఎండీ అజ్మస్, సిరికొండ శ్రీనివాస్, సంయుక్త ఆధికారులు కండ్ల రాజలింగు, సుంకె గంగాధర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఎస్టీపీపీ ప్రమాదాలపై సమగ్ర విచారణ చేపట్టాలి

- సేఫ్టీ కమిటీ వెంటనే ఏర్పాటు చేయాలి
- ఐఎన్టీయూసీ నాయకులు పేరం రమేష్



నవతెలంగాణ-జైపూర్

సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్‌లో జరుగుతున్న ప్రమాదాలపై సమగ్ర విచారణ చేపట్టాలని ఐఎన్టీయూసీ అనుబంధ ఎస్టీపీపీ కాంట్రాక్టు కార్మిక సంఘం అధ్యక్షుడు పేరం రమేష్ డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులతో కలిసి శుక్రవారం ఎస్టీపీపీ గేట్ మీటింగ్‌లో కార్మికుల సమస్యలు పరిష్కారం విషయమై మాట్లాడారు. కాగా ఎస్టీపీపీ ఏర్పడి 10 సంవత్సరాలు కావస్తున్నా ఫ్యాక్టరీ చట్టాన్ని పూర్తిగా అమలు చేయడం లేదని, ప్లాంట్‌లో పదుల సంఖ్యలో ప్రమాదాలు చోటు చేసుకోవడంతో పాటు ప్రాణాపాయాలు జరిగినా యాజమాన్యం కప్పిపుచ్చుతోందని ఆరోపించారు. ప్రమాదాలు జరుగుతున్న తీరుపై విచారణ చేపట్టకపోవడం ఒకింత కార్మికులకు అన్యాయం జరుగుతోందని అన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి పీరియాడికల్‌గా కార్మిక సమస్యలపై సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ చీఫ్ ఫ్యాక్టరీ ఇన్స్‌పెక్టర్ గంగాధర్ రెడ్డి ఆధ్వర్యంలో వచ్చే నెలలో సమావేశం ఉంటుందని ఆయన వెల్లడించారు. కాగా ప్లాంట్ ప్రమాదాల తీరుపై జాయింట్ చీఫ్ ఫ్యాక్టరీ ఇన్స్‌పెక్టర్ మోహన్‌బాబు, డిప్యూటీ ఫ్యాక్టరీ ఇన్స్‌పెక్టర్ గంగాధర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు.

అంబులెన్స్‌లో మహిళ ప్రసవం



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని సోనాపూర్ తండాకు చెందిన బానోత్ కృష్ణవేణి 108 అంబులెన్స్‌లో పండంటి బిడ్డకు జన్మనిచ్చిందని పైలట్ మునిందర్ గౌడ్ తెలిపారు. కృష్ణవేణికి నొప్పులు రావడంతో కుటుంబీకులు అంబులెన్స్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఆమెను ఆసుపత్రికి తరలిస్తుండగా నొప్పులు రావడంతో అంబులెన్సులోనే బిడ్డకు జన్మనిచ్చిందన్నారు. అనంతరం వారిని ఆసుపత్రికి తరలించారు. తల్లి బిడ్డలకు క్షేమంగా ఉన్నట్లు వారు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘం కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-జైపూర్

గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం భీమారం మండల కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ఎంపీడీఓ మదుసూధన్, ఎంపీఓ సతీష్‌రెడ్డిల ఆధ్వర్యంలో శుక్రవారం మండల బాడీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నర్సింగాపూర్ కార్యదర్శి క్రాంతి తేజ, జనరల్ సెక్రెటరీగా ధర్మారం కార్యదర్శి శ్రావన్ కుమార్, అసోసియేట్ అధ్యక్షులుగా ఆరెపల్లి కార్యదర్శి దేవేందర్, ట్రెజరర్‌గా ఎల్కేశ్వరం కార్యదర్శి రవి కుమార్, ఉపాధ్యక్షుడిగా భీమారం, పోలంపల్లి, ఖాజీపల్లి, దాంపూర్ కార్యదర్శులు క్రిష్ణమూర్తి, సృజన్, రాజశేఖర్, శ్రీనివాస్‌లు ఎన్నికయ్యారు. అదేవిధంగా ఆర్గనైజింగ్ సెక్రెటరీగా మద్దికల్ కార్యదర్శి గణేష్ కుమార్, జాయింట్ సెక్రెటరీగా భూర్గుపల్లి కార్యదర్శి ఉమారాణి, ఈసీ సభ్యులుగా కొత్తపల్లి కార్యదర్శి వసుందర ఎంపికైనట్లు ఎన్నికల నిర్వాహకులు ఎంపీఓ సతీష్‌రెడ్డి ప్రకటించారు.

ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు అవగాహన



నవతెలంగాణ-మందమర్రి

మంచిర్యాల జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్, హౌజింగ్ కార్పొరేషన్ బన్సీ లాల్ ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు ఇండ్ల నిర్మాణం గురించి అవగాహన కల్పించారు. శుక్రవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాజేశ్వర్ రెడ్డితో కలిసి పొన్నారం గ్రామ పంచాయతీలో మంచిర్యాల జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్, హౌజింగ్ కార్పొరేషన్ బన్సీ లాల్ పర్యటించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు ఇండ్ల నిర్మాణం గురించి అవగాహన సదస్సు నిర్వహించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శనివారం | ఫిబ్రవరి 22, 2025 | www.navatelangana.com

ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి

నవతెలంగాణ-నార్నూర్



మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, పట్టభద్రుల కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం గాదిగూడ మండల కేంద్రంలో ప్రచారంలో భాగంగా మద్దత్తుగా గ్రాడ్యుయేట్ అభ్యర్థులతో కలిసి మార్కెట్‌లో ప్రచారం చేశారు. అనంతరం పోస్టర్లను విడుదల చేశారు. వారి వెంట మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు ఉన్నారు.

28న జరిగే ఢిల్లీ సదస్సును జయప్రదం చేయాలి

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ఈనెల 28న జరిగే ఢిల్లీ సదస్సును జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కె.రాజన్న అన్నారు. శుక్రవారం సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన ఫాసిస్ట్ కార్పొరేట్ మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని, ప్రజాస్వామ్యం, లౌకికవాదం, ఫెడరలిజానికి ప్రజలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అలాగే ఆలిండియా సదస్సును జయప్రదం చేయాల్సిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు ఫెరోజ్, గంగాధర్, గంగామణి, భూమన్న, రాకేష్, గంగాధర్, రాజేశ్వర్ పాల్గొన్నారు.



ఎన్నికల పోలింగ్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహిస్తాం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాలతో కూడిన కరీంనగర్ శాసన మండలి ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాల ఎన్నికల పోలింగ్ ప్రక్రియను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి, ఇతర ముఖ్య ఎన్నికల అధికారులు ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, సబ్ కలెక్టర్ యువరాజ్, ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్ తదితరులు కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి పాల్గొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణ, ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ఏర్పాటు, కరీంనగర్‌లోని రిసెప్షన్ సెంటర్‌కు బ్యాలెట్ బాక్సుల తరలింపు, పోస్టల్ బ్యాలెట్, వెబ్ క్యాస్టింగ్ ఏర్పాట్లు, పోలింగ్ కేంద్రాల్లో వసతులు, పోలీసు బందోబస్తు, ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్లు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, నిఘా బృందాల పనితీరు పర్యవేక్షణ తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సంబంధిత జిల్లాల కలెక్టర్లకు కీలక సూచనలు చేశారు. ఈసీ మార్గదర్శకాల ప్రకారం ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఎస్పీ జీవన్‌రెడ్డి, ఆర్డీఓ వినోద్‌కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రపంచ విజేతకు ఘన సన్మానం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

క్రీడలపై మక్కువ పెంచుకుంటే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించవచ్చని సాయిపోతిరెడ్డి శివారెడ్డి నిరూపించారని పోస్టల్ ఎస్పీ దేవారెడ్డి సిద్దార్థ అన్నారు. ఆదిలాబాద్ హెడ్ పోస్టాఫీసులో పోస్టల్ అసిస్టెంట్‌గా స్పోర్ట్స్ కోటాలో శివారెడ్డి ఖోఖో ప్రపంచ కప్‌లో పాల్గొని బెస్ట్ అటాకర్‌గా మెడల్ సాధించారు. శుక్రవారం హెడ్ పోస్టాఫీసులో సామాజికవేత్త ముదుపు మౌనిష్‌రెడ్డి, సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్‌కుమార్ ఖత్రి శివారెడ్డిని సత్కరించారు. శాలువాతో సన్మానించిన మౌనిష్‌రెడ్డి ప్రోత్సాహకంగా తనవంతుగా నగదును అందించారు. అదే విధంగా జూడో ఇంటర్నేషనల్ క్రీడాకారిణి మల్లప్రభను సత్కరించి అభినందలు తెలిపారు. ఈ సందర్భంగా పోస్టల్ ఎస్పీ దేవారెడ్డి సిద్దార్థ మాట్లాడుతూ కార్యాలయంలో రోజుకు ఎనిమిది గంటలు పని చేస్తు ఖోఖో సాధన చేశారని తెలిపారు. ఏపీకి చెందిన శివారెడ్డికి మంచిర్యాల నుంచి ట్రైన్ సౌకర్యం ఉన్న కూడా అక్కడ పోస్టింగ్ తీసుకోలేదన్నారు. కేవలం ఆదిలాబాద్‌లో ప్లే గ్రౌండ్ ఉందని తెలిసి ఇక్కడి పోస్టింగ్ తీసుకున్నారని తెలిపారు. దీంతో ఆయనకు స్పోర్ట్స్‌పై ఉన్న మక్కువ తెలిసిపోతుందన్నారు. కార్యక్రమంలో పోస్ట్ మాస్టర్ గంగాధర్, సిబ్బంది ఉత్తంకుమార్, సనాత హిందూ ఉత్సవ సమితి నాయకులు పాల్గొన్నారు.

మార్చి-1 వరకు చికెన్ షాపులు బంద్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బర్డ్‌ఫ్లూ ప్రభావంతో జిల్లాలో చికెన్ అమ్మకాలు పడిపోయాయి. జిల్లాలో ఇప్పటి వరకు బర్డ్‌ఫ్లూ వైరస్ ఆనవాళ్లు లేకున్న ఇతర జిల్లాలో వైరస్ వ్యాప్తి కారణంగా చికెన్ తినేందుకు ప్రజలు జంకుతున్నారు. వారం రోజులుగా వ్యాపారం అంతంత మాత్రమే సాగుతుండటంతో చికెన్ విక్రయదారులు ఓ నిర్ణయం తీసుకున్నారు. బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్ తగ్గేంత వరకు అమ్మకాలను నిలిపివేయాలని తీర్మాణం చేశారు. శుక్రవారం పట్టణంలో వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలను మూసివేశారు. దుకాణాలు తెరిచిన గిరాకులు లేక ఖాళీగా కూర్చోవాల్సి వస్తుంది. ప్రజల్లో ఉన్న భయం తొలిగే వరకు అమ్మకాలను చేపట్టబోమని పేర్కొన్నారు.

స్వచ్ఛధంగా మూసేస్తున్నాం...

ఈ సందర్భంగా పలువురు వ్యాపారులు మాట్లాడారు. జిల్లాలో బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్ లేదని, ఎలాంటి భయం లేకుండా చికెన్ తినొచ్చని వ్యాపారులు అంటున్నారు. ఏదైనా వైరస్ ఉంటే మొదట తమపై ప్రభావం చూపుతుందన్నారు. ఇప్పటి వరకు తమకు ఎలాంటి వైరస్ ప్రభావం రాలేదన్నారు. ప్రజల్లో ఉన్న భయం పోయేంత వరకు అమ్మకాలను స్వచ్ఛందంగా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. చికెన్ విక్రయాలను నిలిపివేయాలని అధికార ప్రకటన రాలేదని తెలిపారు. అయితే ఇతర జిల్లాల్లో బర్డ్‌ఫ్లూ వార్తల నేపథ్యంలో ప్రజల్లో ఆందోళన ఉందన్నారు. గిరాకీలు కూడా కావడం లేదన్నారు. వైరస్ ప్రభావం లేదని, ప్రభుత్వం నుంచి ప్రకటన వచ్చే వరకు తాము కూడా విక్రయాలను చేయబోమని స్పష్టం చేశారు. వైరస్‌పై రాష్ట్ర వ్యాప్తంగా భయాందోళన పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. గురువారం నుంచి వారం రోజుల పాటు అంటే మార్చి-1వ తేది వరకు తమ దుకాణాలను మూసి ఉంచుతామన్నారు.

సోషలిస్టు వ్యవస్థనే ప్రత్యామ్నాయం

• సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పెట్టుబడిదారి వ్యవస్థకు సోషలిజమే ప్రత్యామ్నాయమని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ అన్నారు. 176 ఏండ్ల క్రితం వెలువడిన కమ్యూనిస్టు ప్రణాళిక నేటికీ అనుసరణీయమని అన్నారు. శుక్రవారం పార్టీ జిల్లా కార్యాలయంలో రెడ్ బుక్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీ రాజకీయ ముసాయిదాను సామూహిక పఠనం చేశారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ పెట్టుబడిదారి వ్యవస్థలో ఆర్థిక అసమానతలు సహజంగానే పెరుగుతున్నాయని పేర్కొన్నారు. 2008లో అమెరికాలో వచ్చిన ఆర్థిక సంక్షోభం ప్రస్తుతం ప్రపంచ సంక్షోభంగా మారిందని వివరించారు. నిరుద్యోగం, పేదరికం పెరిగిందని, మరోపక్క కొంత మంది కార్పొరేట్ శక్తుల పెట్టుబడిదారుల దగ్గర సంపద పోగుబడుతోందని చెప్పారు. మన దేశంలో నేటికీ 85 కోట్ల మంది తెల్లరేషన్ కార్డుల మీద ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారని అన్నారు. మరోపక్క ప్రపంచ కుబేరుల్లో అదానీ, అంబానీ లాంటి వారు చేరుతున్నారని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలు దీనికి కారణమని స్పష్టం చేశారు. సోషలిజం మాత్రమే ఆర్థిక అంతరాలు లేని సమాజాన్ని సృష్టిస్తుందని కమ్యూనిస్టు ప్రణాళిక పేర్కొందని ఇది అందరికీ ఆచరణీయమని పేర్కొన్నారు. సోషలిజం సాధించడం కోసం కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లంక రాఘవులు, సీనియర్ నాయకుడు బండి దత్తాత్రి, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.మంజుల, ఆర్.సురేందర్, జమున, ఎన్.స్వామి, నాయకులు లింగాల చిన్నన్న, ఏ.స్వామి, ఉయిక విష్ణు, ఆరిఫా, లలిత, కె.ఆశన్న పాల్గొన్నారు.

రాష్ట్ర ఎమ్మెల్సీ ఎన్నికలను సజావుగా నిర్వహించాలి

నవతెలంగాణ-నిర్మల్



రాష్ట్ర ఎమ్మెల్సీ ఎన్నికలను సజావుగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై సీఈఓ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా, ఎన్నికల ప్రవర్తన నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన వసతులు కల్పించి, ఫిబ్రవరి 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని సీఈఓ సూచించారు. అలాగే, ఎన్నికల సిబ్బందికి శిక్షణ అందించాలని, బ్యాలెట్ డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్లను అనువైన ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలకు ప్రిసైడింగ్ అధికారి, ముగ్గురు పోలింగ్ అధికారులను నియమించాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలోని నిర్మల్, బైంసా డివిజన్‌లలోని మండల కేంద్రాలలో మొత్తం 46 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. 21 లొకేషన్‌లలోని పోలింగ్ కేంద్రాలను 8 రూట్లలో విభజించామని తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో అన్ని వసతులు కల్పిస్తున్నామని, ర్యాంప్, వీల్ చైర్, తాగునీరు, మెడికల్ సిబ్బంది ని అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఓటరు స్లిప్లను పంపిణీ చేస్తున్నామని, ఎన్నికల సిబ్బందికి ఇప్పటికే శిక్షణలు అందించామని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని వివరించారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీఓలు రత్నకల్యాణి, కోమల్ రెడ్డి, జెడ్పీ సీఈఓ గోవింద్, డీపీఓ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయాలి

• వ్యవసాయ కార్మిక సంఘం మహిళ కూలీల రాష్ట్ర కన్వీనర్ బొప్పాని పద్మ



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మహిళ కూలీల రాష్ట్ర కన్వీనర్ బొప్పాని పద్మ అన్నారు. శుక్రవారం నిర్మల్ పట్టణంలోని టీఎన్జీవోస్ భవనంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా విస్తృత సమావేశం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్ రాములు, వ్యవసాయ కార్మిక సంఘం మహిళ కూలీల రాష్ట్ర కన్వీనర్ బొప్పాని పద్మ హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రతి మహిళకు నెలకు రూ.2500 చెల్లించాలని, పెన్షన్లను రూ.4వేలు పెంచి చెల్లించాలని అన్నారు. పెండ్లి కానుకగా రూ.లక్ష, తులం బంగారం ఇవ్వాలన్నారు. వికలాంగుల పెన్షన్లను ఆరువేలకు పెంచాలని, ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగంలో కూలీలుగా ఎక్కువ మంది మహిళలు పనిచేస్తున్నారు. శ్రమ దోపిడికి గురి అవుతున్నారని అన్నారు. ఉపాధి హామీ పనుల్లో కూడా ఎక్కువ మంది మహిళలు పాల్గొంటున్నారు. ప్రతి ఒక్కరికి సంవత్సరానికి 200 రోజులు పని దినాలు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన కుమార్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి నాగేల్లి నర్సయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, కే.శ్రీనివాస్, భూక్య విలాస్, తిమ్మాపురం ముత్తన్న, మామూల్ల కృష్ణదాస్ బర్కుంట గంగారాం, జాదవ్ కిషన్ పాల్గొన్నారు.

అణగారిన వర్గాల గొంతుకనవుతా..

• ధర్మ సమాజ్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మంద జ్యోతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



అణగారిన వర్గాల బిడ్డగా ఉమ్మడి మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల పట్ట భద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ధర్మ సమాజ్ పార్టీ పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థి మంద జ్యోతి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వేల కొట్లున్న అగ్రవర్ణాలు పోటీ చేస్తున్నాయని, కాంగ్రెస్, బీజేపీ లాంటి పార్టీలు వేల కోట్లు ఉన్న నాయకులకు ప్రాధాన్యత కల్పించాయని, వారి వల్ల సమాజానికి మేలు జరగదని పేర్కొన్నారు. ప్రజాస్వామికంగా పీడిత వర్గాలకు న్యాయం జరగాలంటే అణగారిన వర్గాల ప్రాతినిధ్యం కావాలని పేర్కొన్నారు. వైద్య వృత్తిలో ఎంతో సేవలందించి, పేద కుటుంబాలకు అండగా నిలుస్తూ పోరాటం చేస్తున్న తనకు మరింతగా మద్దతుగా నిలిచి గెలిపించాల్సిందిగా వేడుకున్నారు. విద్యా, వైద్యం నాణ్యతలేమితో ప్రజలు మరింత పేదరికం బారిన పడుతున్నారని, అగ్రకులాలకు ఓటుకు అమ్ముడు పోకుండా చైతన్యంతో పట్టభద్రులు, విద్యావంతులు, మేధావులు ఆలోచించి 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి అన్నెల లక్ష్మణ్, జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేష్, జిల్లా నాయకులు అన్నెల అడెల్లు, దర్శనాల సుష్మ, గోపి, బోథ్ మండల అధ్యక్షుడు కొండమడుగు గణేష్, తలమడుగు మండల అధ్యక్షుడు అగ్గిమల్ల నవీన్, ఇచ్చోడ మండల నాయకుడు లక్ష్మణ్, జైనథ్ మండల నాయకుడు గొంటిముక్కుల ఒమన్న, ఆదిలాబాద్ అర్బన్ నాయకుడు తొంటికోరి సంతోష్, ఆదిలాబాద్ రూరల్ మండలం నాయకులు విఠల్, వివిధ మండలాల నాయకులు వినోద్, రాంచందర్, సాయి కుమార్, వినుకుమార్, వినోద్ పాల్గొన్నారు. క్రీడలపై మక్కువ పెంచుకుంటే రాణించొచ్చు.

పట్టభద్రులు కాంగ్రెస్ వైపే

• భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ



నవతెలంగాణ-బోథ్

పట్టభద్రులు కాంగ్రెస్ వైపే చూస్తున్నారని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గాజేందర్ అధ్వరంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ ఏడాదిలోపే 55 వేలకు పైగా ఉద్యోగాలు, ప్రజా ప్రభుత్వం కల్పించిందన్నారు. గ్రూప్ వన్, టు నోటిఫికేషన్లు ఇచ్చి పేపర్ లీకేజీలు లేకుండా, పరీక్షలు పూర్తి చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందన్నారు. అలాగే 11వేల పోస్టులతో డీఎస్సీ నిర్వహించి, ఉపాధ్యాయుల్ని నియమించామని, జాబ్ క్యాలెండర్ ప్రకారమే టెట్ ఎగ్జామినేషన్ నిర్వహించామన్నారు. ఎమ్మెల్సీ కోడ్ పూర్తికాగానే మరో డీఎస్సీ ఎగ్జామ్ నిర్వహిస్తామని అన్నారు. పట్టభద్రులు గమనించి రానున్న ఎన్నికల్లో ఊట్కూరి నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలచారి, మాజీ ఎంపీ సోయం బాపూరావు, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు, టీపీసీసీ జనరల్ సెక్రటరీ సత్తు మల్లేష్, ఏడీసీసీ చైర్మెన్ అడ్డి భోజరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మెన్‌లు బొడ్డు గంగారెడ్డి, సత్యవతి కోటేష్, మాజీ జెడ్పీటీసీలు గోక గణేష్‌రెడ్డి, మల్లెపూల నర్సయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పని చేయాలి

• ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



నవతెలంగాణ-భైంసా

పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కార్యకర్తలు విజయమే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని గోడం నగేష్, ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ సూచించారు. శుక్రవారం భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో భైంసా పట్టణ, మండల ముఖ్య కార్యకర్తలతో ఎన్నికల సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమురయ్యకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ప్రతి 25 మంది ఓటర్లకు ఇన్‌చార్జిని నియమించడం జరిగిందని తెలిపారు. సమయం తక్కువ ఉన్నందున, పనితీరును వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నారాయణరెడ్డి, గోపాల్ సర్డా, పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరి నాయక్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పైడిపల్లి గంగాధర్, భైంసా మాజీ మున్సిపల్ చైర్మెన్ బి.గంగాధర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ రాజేష్ బాబు, సీనియర్ నాయకులు బోయిడి విఠల్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి

• విత్తన అభివృద్ధి కార్పొరేషన్ చైర్మెన్ సుంకేట అన్వేష్‌రెడ్డి



నవతెలంగాణ-నిర్మల్

ఉమ్మడి మెదక్, ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని తెలంగాణ విత్తన అభివృద్ధి సంస్థ చైర్మెన్ అన్వేష్‌రెడ్డి అన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని మారుతి హోటల్లో శుక్రవారం ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వంలో ప్రభుత్వ ఉద్యోగులు ఎంతో ఇబ్బందులు పడ్డారని అన్నారు. రాష్ట్రంలో మార్పు రావాలని కోరుకోవడంతో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని తెలిపారు. రేవంత్ ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఫ్రెండ్లీ ప్రభుత్వమని అన్నారు. అనంతరం పెన్షనర్‌ల సంఘం జాతీయ కార్యదర్శి ఎంసీ లింగన్న ఆధ్వర్యంలో మెమోంటో అందజేసి శాలువా కప్పి సన్మానించారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి హనుమంత్‌రెడ్డి , పి.విలాస్, పి. జనార్దన్, కె.రమేష్, బి.కిషన్‌రావు, నిర్మల్ ఏఎంసీ చైర్మెన్ సోమ భీంరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మెన్ అప్పాల గణేష్ చక్రవర్తి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మెన్ ఎర్రవోతు రాజేందర్, పద్మాకర్ పాల్గొన్నారు.

నేడు భైంసాకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి రాక

నవతెలంగాణ-భైంసా

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం భైంసాకు కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి రానున్నారని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4నాలుగు గంటలకు ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో నియోజకవర్గ కార్యకర్తలు, పట్టభద్రుల ఓటర్లతో సమావేశం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎంపీ గోడం నగేష్‌తో పాటు బీజేపీ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర నాయకులు హాజరవుతారన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సమావేశానికి హాజరుకావాలని ఎమ్మెల్యే కోరారు.